నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 HYDERABAD

## ఎగ్జిబిషన్ పొడిగించాలని
# స్టాల్ యజమానుల విజ్ఞప్తి

అబిడ్స్, ఫిబ్రవరి 10: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను వారం రోజులపాటు పొడిగించాలని స్టాల్ యజమానులు ఎగ్జిబిషన్ సొసైటీకి విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన 46 రోజుల పాటు కొనసాగిస్తూ వస్తున్నారు. కాగా ఈ సంవత్సరం జనవరి ఒకటో తేదీన ప్రారంభం కావాల్సిన అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో సంతాప దినాల కారణంగా జనవరి మూడో తేదీ నుంచి ప్రారంభించారు. అయితే ఎగ్జిబిషన్‌ను వారం రోజులపాటు పొడిగించాలని స్టాల్ యజమానులు సొసైటీ ప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. కాగా పోలీస్ శాఖ మాత్రం ఎగ్జిబిషన్‌ను పొడిగించేది లేదని ఆదివారం పేర్కొన్నట్టు తెలిసింది. స్టాల్ యజమానులు మాత్రం తమకు వారం రోజులు పాటు నుమాయిష్ పొడిగించకపోతే నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వారు సొసైటీ ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిసింది. ఎగ్జిబిషన్స్ సొసైటీ ఈ విషయంపై ఏ నిర్ణయం తీసుకుంటుందో అని స్టాల్ యజమానులు ఎదురుచూస్తున్నారు.



ఉప్పల్ చిలుకానగర్ రోడ్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు



సోమవారం కొడంగల్‌లో బీఆర్ఎస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# ఉప్పొంగిన అభిమానం

**కొడంగల్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రావడంతో ఆనందం వ్యక్తం చేసిన గిరిజన రైతులు**

- దారిపొడవునా హారతులిచ్చి.. సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం
- ఉదయం నుంచే ఆయన రాక కోసం నిరీక్షించిన లగచర్ల, హకీంపేట, రోటిబండతండా, పోలేపల్లి రైతులు
- తుంకిమెట్లలో పార్టీ జెండా ఆవిష్కరణ.. అనంతరం రైతులను కలిసిన మాజీ మంత్రి కేటీఆర్

వికారాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రావడంతో లగచర్ల గిరిజన రైతుల్లో అభిమానం ఉప్పొంగింది. దారి పొడవునా ఆటపాటలు, హారతులిచ్చి వారి సంప్రదాయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. లగచర్ల రైతులకు మొదటి నుంచి అండగా నిలిచిన కేటీఆర్.. సోమవారం హకీంపేటకు వస్తున్నాడని తెలిసి లగచర్ల, హకీంపేట, రోటిబండతండా, పోలేపల్లి రైతులు ఉదయం నుంచే ఆయన కోసం ఎదురు చూశారు. మాజీ మంత్రి కేటీఆర్ కోస్గి బహిరంగకు వెళ్తూ తుంకిమెట్ల వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం హకీంపేట వద్ద లగచర్ల రైతులను కలుసుకున్నారు. లగచర్ల ఘటనలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన తన భర్త ను విడిపించుకునేందుకు ఢిల్లీ వరకు వెళ్లి న్యా య పోరాటం చేసిన నిండు గర్భిణి జ్యోతి విజ్ఞ ప్తి మేరకు కేటీఆర్ ఆమె బిడ్డకు భూమిగా నామకరణం చేశారు. కొడంగల్ సెగ్మెంట్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకతో శ్రేణుల్లో ఫుల్ జోష్ వచ్చింది. గులాబీ శ్రేణులు భారీగా తరలివ చ్చారు. తుంకిమెట్ల నుంచి హకీంపేట వరకు ఎక్కడా చూసిన గులాబీమయంగా మారిపోయింది. కొడంగల్ నుంచి పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని ఇచ్చిన హామీ ప్రకారం కేటీఆర్ సెగ్మెంట్ అభ్యున్నతికి భారీగా నిధులిచ్చి రూపురేఖలను మార్చివేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన కేటీఆర్ ఏడాది తర్వాత కొడంగల్‌కు రావడంతో సీఎం సీఎం అంటూ రైతు లు, బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు పి.సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోతు కవిత తదితరులు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ అయ్యిందా.. సీజ్ చెయ్..

- ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సుల ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు గ్రేటర్ కసరత్తు
- ఏటా బౌన్స్ అవుతున్న కోట్లాది రూపాయల చెక్కులు
- మొండి బకాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయం
- తాజాగా మియాపూర్‌లో దుకాణం సీజ్

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/మియాపూర్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ కార్పొరేషన్ ఆదాయన్ని పెంచుకునేందుకు నానా తంటాలు పడుతున్నది. ప్రధానమైన ఆదాయ వనరుగా వస్తున్న ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సుల ఫీజు వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నా..ఆ మేరకు ఆశించిన మేర రావడం లేదు. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్న దరిమిలా దూకుడు పెంచేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయల విలువైన చెక్కులు బౌన్స్ అవుతున్నా ఇప్పటివరకు వారికి నోటీసులు ఇచ్చి ఆపై వదిలివేస్తున్నారు. వ్యాపార సముదాయాలు, కార్యకలాపాలు ఉన్న నిర్మాణదారులు కూడా ఇలా మొండికేస్తే ఇకపై నిబంధనల కొరడా ఝుళిపించేందుకు సిద్ధమయ్యారు. పలు దశల్లో నోటీసులు ఇచ్చినా వినకుంటే వారి వ్యాపార కార్యకలాపాలు నిలిపివేస్తే పన్ను కచ్చితంగా చెల్లిస్తారని భావిస్తున్నారు.

### సుమారు రూ. 4,445 కోట్లు..





గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రస్తుతం ఏటా సుమారు రూ.4,445 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఇందులో గ్రాంట్లు, ఇతరత్రా ఉన్నప్పటికీ ప్రధానంగా ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సుల ఫీజు వసూలు ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో తాజా ఆర్థిక సంవత్సరం 2024-25లో రూ.1970 కోట్ల మేర పన్ను వసూలు చేయాలని జీహెచ్ఎంసీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇప్పటివరకు సుమారు రూ.1400 కోట్ల వరకు వసూలైనట్లు తెలుస్తున్నది. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న దరిమిలా వసూళ్లు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు అధికారులపై ఒత్తిడి పెంచారు. అయితే ప్రతి సంవత్సరం వసూళ్లలో భాగంగా అధికారులు కోట్లాది రూపాయల విలువైన చెక్కులు అందుకుంటారు. ఈ రూపంలో ఆస్తిపన్నుదారులు సక్రమంగానే చెల్లింపులు చేస్తున్నా... కొందరి చెక్కులు మాత్రం బౌన్స్ అవుతుంటాయి. దీంతో అధికారులు ఇప్పటివరకు ఈ చెక్ బౌన్స్ కేసులకు సంబంధించి నోటీసుల ద్వారా సమాచారం అందించి ఊరుకుంటున్నారు. కానీ ఇప్పటినుంచి ఇలా కాకుండా కఠినంగా వ్యవహరించేందుకు నిర్ణయించారు. ఆ మేరకు నిబంధనల రూపంలో అధికారాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు వాటిని పెద్దగా వినియోగించలేదు. ఇక నుంచి అలా చేస్తేనే మొండి బకాయిదారులు దారిలోకి వస్తారని భావిస్తున్న అధికారులు వ్యాపార సంస్థలను సీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మియాపూర్ పరిధిలో సోమవారం ఒక దుకాణాన్ని అధికారులు సీజ్ చేశారు. తద్వారా ఇతరులు వెంటనే పన్నులు, ఫీజులు చెల్లిస్తారని అధికారులు ఆశిస్తున్నారు.

### ఎఫ్ఐఆర్ నమోదుకూ అవకాశం..

ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సు ఫీజులను చెక్కుల రూపంలో అందించే ఆస్తిపన్నుదారులు ఒకవేళ తమ అకౌంట్లలో అందుకు సంబంధించిన మొత్తాన్ని నిల్వగా ఉంచకుంటే చెక్ బౌన్స్ అవుతుంది. దీంతో ఇలాంటి వారికి నిబంధనల ప్రకారం 'ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్' కింద నోటీసు ఇచ్చి తిరిగి చెల్లించేందుకు 15 రోజుల పాటు అవకాశం ఇస్తారు. ఒకవేళ చెల్లించకుంటే స్టాండింగ్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లి తుది నోటీస్ జారీ చేస్తారు. అయినప్పటికీ చెల్లించనట్లయితే ఎఫ్ఐఆర్ నమోదుకు కూడా వెసులుబాటు ఉందని అధికారి ఒకరు తెలిపారు. పన్నుదారులు ఇంకా మొండిగా వ్యవహరిస్తే వారి వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయేలా దుకాణాలు, వ్యాపార సంస్థలను సీజ్ చేస్తారు. వాస్తవానికి ఈ నిబంధనలు గతంలో కూడా ఉన్నప్పటికీ వినియోగించేంత అనివార్యత ఏర్పడలేదు. కానీ లక్ష్యాన్ని చేరుకోవాలంటూ ఉన్నతాధికారులు చేసే ఒత్తిడి దృష్ట్యా అధికారులు ఈ దిశగానే అడుగులు వేయనున్నట్లు తెలుస్తున్నది.



నినాదాలు చేస్తున్న జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

## ఎన్నికల బిల్లులు చెల్లించకుంటే
# పనులన్నీ నిలిపేస్తాం

- సర్కారు స్పందించకుంటే నిరసనలు ఉద్ధృతం
- జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హెచ్చరిక

సిటీ బ్యూరో: ఎన్నికల ఏర్పాట్ల పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని పనులను నిలిపేస్తామని జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికలు జరిగి 14 నెలలు దాటుతున్నా.. ఏర్పాట్ల కోసం వెచ్చించిన బిల్లులను విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... 2023 నవంబర్‌లో నిర్వహించిన శాసనసభ ఎన్నికలు, 2024 ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల బిల్లులను విడుదల చేయకుండా కాంట్రాక్టర్లను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణకు టెండర్లు పిలిచి, అడ్వాన్స్ ఇవ్వకున్నా పనులు చేశామని వాపోయారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు దాటుతున్నా బిల్లులు విడుదల చేయకుండా కాంట్రాక్టర్లను ఆర్థికంగా కుంగదీస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అవాంతరాలు రాకుండా ఎన్నికల నిర్వహణను విజయవంతంగా పూర్తి చేసి, ప్రభుత్వానికి దన్నుగా నిలిచామని గుర్తు చేశారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన బిల్లులను విడుదల చేయకుంటే నిరసనలు చేపట్టి, ప్రభుత్వంలో చలనం వచ్చేలా కార్యచరణ రూపొందిస్తామని వెల్లడించారు.

### రిటర్నింగ్ ఆఫీసర్ల బినామీలకే చెల్లింపులు..

ఎన్నికల నిర్వహణకు కొన్ని చోట్ల రిటర్నింగ్ ఆఫీసర్లు తమ బినామీలకే కాంట్రాక్టులిచ్చారని వారు ఆరోపించారు. అలాంటి వారికి మాత్రం బిల్లులు చెల్లించుకున్నారని, నిజాయతీగా టెండర్‌లో పాల్గొని ఎన్నికల నిర్వహణ విజయవంతమవ్వడానికి కారణమైన మిగతా కాంట్రాక్టర్లకు మొండి చేయి చూపుతున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల పేరిట వచ్చిన డబ్బును పీఓ, ఈపీఓ, ఇతర ఎన్నికల సిబ్బందికి టీఏ, డీఏల రూపంలో ఇచ్చారన్నారు.

### మలక్ పేట నియోజవర్గానికి మాత్రమే ఎందుకిచ్చారు?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచి ఎన్నికల నిర్వహణ చేపట్టారని.. బిల్లులు మాత్రం ఒక మలక్ పేట నియోజకవర్గ పరిధిలోని కాంట్రాక్టర్లకు మాత్రమే చెల్లించారని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలంటూ రాష్ట్రపతిని కలిసి వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. ఆమె ఆదేశాలతో గత డిసెంబర్‌లోనే రూ.27.5 కోట్లకు ప్రభుత్వం మేమెంట్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. 15 నియోజకవర్గ పరిధిలోని కాంట్రాక్టర్లందరికీ చెక్కులు మంజూరు చేస్తే.. ఆర్థిక శాఖ నుంచి మాత్రం మలక్ పేటకు మాత్రమే డబ్బులు ఇచ్చారని వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులను కలిస్తే స్పందన కరవైందని ఆవేదన వ్యక్తం చేశారు.

### కాంట్రాక్టర్లను దగ్గరకు రానీయని సీఎం

తమ సమస్యను చెప్పుకుందామని ఏడాది నుంచి సీఎం అపాయింట్‌మెంట్ అడుగుతున్నా పట్టించుకోవడం లేదని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కాంట్రాక్టర్లు అంటేనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరకు రానీయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని రిటర్నింగ్ అధికారి నుంచి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దాకా అందరినీ కలిసి వినతి పత్రాలు అందించామని తెలిపారు. ఎవరూ తమకు సరైన సమాధానం ఇవ్వడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే కేంద్రంలోనే తేల్చుకుంటామని చెప్పారు. ప్రభుత్వంలో చలనం వచ్చేలా పకడ్బందీ ప్రణాళికతో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

### కాంట్రాక్టర్లను ఆర్థికంగా కుంగదీసే కుట్ర

జీహెచ్ఎంసీ పరిధిలోని దాదాపు 350 మంది కాంట్రాక్టర్లను ఆర్థికంగా కుంగదీసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. ఎన్నికల బిల్లులతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించిన నిధులను విడుదల చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

# దరఖాస్తులు మళ్లీ.. మళ్లీ..

- ఆన్‌లైన్‌లో సమాచారం లేకపోవడంతో తికమకలో జనం
- దరఖాస్తు తీసుకున్నట్లు రసీదులివ్వని అధికారులు
- కిటకిటలాడుతున్న కలెక్టరేట్ పరిసరాలు





సిటీ బ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం తీరుతో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. తమ నుంచి దరఖాస్తులు తీసుకున్నట్లు ఎలాంటి రసీదులు ఇవ్వకపోవడంతో తికమకపడుతున్నారు. దరఖాస్తును అధికారులు పరిగణనలోకి తీసుకున్నారో లేదోనని మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నామని చెబుతున్నారు. మరోవైపు వార్డుల్లోకి అధికారులు ఎప్పుడు వస్తారనే సమాచారం సైతం లేకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు అందజేస్తున్నామని అంటున్నారు. దీంతో సోమవారం వచ్చిందంటే ప్రాంగణమంతా దరఖాస్తు దారులతో కిటకిటలాడుతోంది. నగరం నలుమూలల నుంచి దివ్యాంగులు, వృద్ధులు, బాలింతలు సైతం వచ్చి దరఖాస్తు ఫారాలను అధికారులకు అందజేస్తున్నారు. అధికారులు మాత్రం అర్జీలు తీసుకోవడమే కానీ వారికి ఎలాంటి రసీదులు ఇవ్వడంలేదని చెబుతున్నారు. దరఖాస్తు చేసుకున్నాక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోగా 'డేటా నాట్ ఫౌండ్' (సమాచారం అందుబాటులో లేదు) అని వస్తుందంటూ వాపోతున్నారు. దీంతో మరోసారి కలెక్టరేట్‌కు వచ్చి దరఖాస్తులు ఇస్తున్నామని తెలియజేస్తున్నారు. ప్రజావాణి దరఖాస్తులు మధ్యాహ్నం ఒంటి గంట వరకే తీసుకోవడంతో చాలా మంది వెనుదిరిగిపోతున్నట్లు చెబుతున్నారు.

### ఐదారు సార్లు అర్జీలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి హైదరాబాద్ జిల్లా ప్రజలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. ఏడాది కాలంగా ఇప్పటి వరకు ఐదారుసార్లు అర్జీలను అధికారులకు ఇచ్చామని ప్రజావాణికి వచ్చినవారు చెబుతున్నారు. తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే లిస్టులో తమ పేర్లు రాలేదని అంటున్నారు. ఎందుకు లేదని అడిగితే తమకేమీ తెలియదని 'మీసేవా' నిర్వాహకులు సమాధానమిస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో అర్జీ పెట్టకున్నా లిస్టులో పేరు రాలేదని వాపోతున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు అన్ని అర్హతలున్నా తమ పేర్లు లిస్టులో రాకపోవడమేంటని ఆందోళన చెందుతున్నారు.చేసేదేమీ లేక కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణిలో మరోసారి అర్జీలు ఇస్తున్నామని నిట్టూరుస్తున్నారు.దరఖాస్తులను స్వీకరిస్తున్న ప్రభుత్వం అర్హులను గుర్తించి సంబంధిత వెబ్‌సైట్లలో పేర్లను నమోదు చేయడంలో విఫలమవుతోంది. అర్జీలను తీసుకోవడానికే పరిమితమవ్వడంతో ప్రజలు తికమకకు గురవుతున్నారు.

### ప్రజావాణికి 1561 దరఖాస్తులు

ప్రజావాణికి 1561 దరఖాస్తులు వచ్చాయని అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుందరెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల్లో డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై 743, గృహ నిర్మాణ శాఖ 735, పింఛన్లకు 55, డీఈవో 4తో పాటు ఇతర శాఖలకు సంబంధించి 24 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిరాం, జిల్లా అధికారులు ఆర్ రోహిణి, పవన్ కుమార్, కోటాజీ, డీఎంహెచ్‌వో వెంకటి తదితరులు పాల్గొన్నారు.

### లిస్టులో పేరు లేదు



నాకు తల్లిదండ్రులు లేరు. భార్య, రెండేండ్ల కుమారుడితో అద్దె ఇంట్లో ఉంటున్నా. రూ.13వేల జీతానికి ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నా. నాకొచ్చి కొద్దిపాటి జీతం ఇంటి అద్దెకే సరిపోవడంలేదు. ఇందిరమ్మ ఇంటి కోసం ఇప్పటికీ మూడు సార్లు దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటిదాకా లిస్టులో నాపేరు రాలేదు. ఇందిరమ్మ ఇల్లు పొందేందుకు అన్ని అర్హతలున్నా నాపేరు లిస్టులో ఎందుకు రావడంలేదో అర్థం కావడంలేదు. నేను, నా భార్య చిన్న పిల్లాడిని తీసుకుని కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో నాపేరు వచ్చేలా చూడాలని కోరుతున్నా. **-పొన్నాల యోగేష్, ఆసిఫ్ నగర్**



## విద్యుత్ శాఖకు
# సమ్మర్ సవాల్!

**గ్రేటర్‌లో ఏటా పెరుగుతున్న డిమాండ్.. గతేడాది కంటే అదనంగా 2 లక్షల కనెక్షన్లు**

**ఇప్పటికే రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదు**

సిటీబ్యూరో: విద్యుత్ శాఖకు సమ్మర్ సవాల్‌గా మారనున్నది. గ్రేటర్‌లో ప్రతీ ఏటా విద్యుత్ కనెక్షన్లు పెరుగుతుండడం, ఈసారి రెండు లక్షలకు పైగా కనెక్షన్లు పెరగడంతో విద్యుత్‌కు డిమాండ్ విపరీతంగా పెరగనున్నది. గ్రేటర్ పరిధిలో 2024 డిసెంబర్ నాటికి 62.92లక్షల కనెక్షన్లు ఉన్నాయి. 2023లో ఈ కనెక్షన్లు 60.26 కనెక్షన్లు ఉండగా, సంవత్సరం పూర్తయ్యేసరికి 2లక్షల కనెక్షన్లు పెరిగాయి. దీనికి సరిపడా ఏర్పాట్లు చేయడం డిస్కంకు సవాల్‌గా మారింది. అందుకే దీనికి సంబంధించిన కార్యాచరణను నవంబర్‌లో ప్రారంభించిన డిస్కం దాదాపు సమ్మర్ సవాల్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమైంది.

### 20 నుంచి 25 శాతం పెరుగుదల

గ్రేటర్‌లో ప్రతీ వేసవిలో విద్యుత్ డిమాండ్ రికార్డ్ స్థాయిలో నమోదవుతోంది. 2023లో 3,756 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉండగా.. 2024లో 16 శాతం పెరిగి 4,352 మెగావాట్లకు చేరుకుంది. 2023 మేనెలలో గరిష్ఠ వినియోగం 81.39 మిలియన్ యూనిట్లు కాగా, 2024లో 12శాతం వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది. అయితే ఈసారి 2 లక్షల కనెక్షన్లు అదనంగా పెరగడంతో ఈ సమ్మర్‌లో విద్యుత్ డిమాండ్ 20 నుంచి 25 శాతం పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. రోజుకు గరిష్ఠ డిమాండ్ 5వేల మెగావాట్లు కాగా ఈ గరిష్ఠ వినియోగం ఏడాదికి 100 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశమున్నది. గ్రేటర్ శివారు ప్రాంతాల్లో వినియోగం విపరీతంగా పెరుగుతోంది.

### ఆ నాలుగునెలలే కీలకం

ప్రస్తుతం చలితగ్గి ఎండలు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వాడకం కూడా పెరుగుతోంది. ఈ ఏడాది జనవరిలోనే గతేడాది మార్చి వినియోగాన్ని దాటిపోయిందంటే డిమాండ్ ఎంతపెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. జనవరి 31న 3334 మెగావాట్లు కాగా.. గతేడాది మార్చి 31న 3018 మెగావాట్లు మాత్రమే. గతంలో విద్యుత్ వినియోగం చూస్తే మార్చి నుంచి పెరుగుతూ ఏప్రిల్, మే వరకు గరిష్ఠ స్థాయికి చేరుతుంది. ఈసారి ఈ నాలుగునెలల్లో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ ఉంటుందని అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అవసరానికి తగ్గట్టుగా 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, ఇతర నెట్‌వర్క్ పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇండస్ట్రీస్ రావడం, కొత్తగా వెలసిన కాలనీల్లో ఇండ్ల నిర్మాణాలు, డెవలప్‌మెంట్ కారణంగా విద్యుత్ కనెక్షన్లు, డిమాండ్ పెరుగుతున్నదని వారు చెప్పారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని, సమస్యలు రాకుండా చూసుకోవాలని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి అధికారులను ఆదేశించారు. ఈ బాధ్యతను ఎస్ఈలు తీసుకోవాలన్నారు.

**ఫిబ్రవరిలో వినియోగం ఇలా!** (మెగావాట్లలో)

| తేదీ | 2025 | 2024 |
|---|---|---|
| 4 | 3320 | 2616 |
| 5 | 3341 | 3027 |
| 6 | 3339 | 3080 |
| 7 | 3371 | 3174 |
| 8 | 3194 | 3133 |

**సగటు డిమాండ్:**

| | | |
|---|---|---|
| 2025 ఫిబ్రవరి లో | 3211 మెగావాట్లు | 64.32 మియూ |
| 2024 ఫిబ్రవరిలో | 3006 మెగావాట్లు | 60.13 మియూ |

**ఫిబ్రవరి,2025 అత్యధిక వినియోగం**

| | | |
|---|---|---|
| ఈ నెలలో 7న అత్యధిక వినియోగం | 3371 మెగావాట్లు | 67.94 మియూ |
| గతేడాది 8న అత్యధిక వినియోగం | 3174 మెగావాట్లు | 64.96 మియూ |